సోలార్ కనెక్షన్ కోసం ఇంటింటా సర్వే

• వివరాలు సేకరిస్తున్న అధికారులు


వివరాలు సేకరిస్తున్న అధికారులు

ధర్మారం: మండలంలోని నందిమేడారంలో ఉచిత సోలార్ కనెక్షన్ కోసం విద్యుత్‌శాఖ అధికారులు వినియోగదారుల వివరాలు సేకరిస్తున్నారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గతేడాది ఆగస్టులో మేడారం గ్రామంలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన సందర్భంగా ఆయన మేడారం గ్రామాన్ని ఉచిత సోలార్ గ్రామంగా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇచ్చిన హామీ మేరకు గ్రామానికి ఉచిత సోలార్ ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో గ్రామంలో విద్యుత్‌శాఖ అధికారులు సర్వే పనులు ప్రారంభించారు. మండలంలోని ఖిలావనపర్తి ఏఈ మహేందర్‌రెడ్డి, సబ్ ఇంజనీర్ దిలీప్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఉచిత సోలార్ కోసం ప్రతీ వినియోగదారుడి నుంచి ఆధార్‌కార్డు, విద్యుత్ బిల్లుతో పాటు బ్యాంకు పాస్‌బుక్‌లు తీసుకుంటూ ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తున్నారు. ఎంటర్ చేయగానే వినియోగదారుడి సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. వినియోగదారుడు ఓటీపీ చెప్పిన వెంటనే ఆయన వివరాలు పూర్తయినట్లుగా నిర్ధారణ చేస్తున్నట్లు మండలంలోని ఖిలావనపర్తి ఏఈ తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి గ్రామంలో సర్వే ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామంలో 1504 గృహాలు ఉండగా ఇప్పటి వరకు 1130 గృహాల సర్వే పూర్తి కాగా మిగతా 374 గృహాలను రెండు రోజుల్లో పూర్తిచేస్తామన్నారు. గృహాలు పూర్తయిన వెంటనే గ్రామంలో ఉన్న 680 వ్యవసాయ పంపు సెట్ల వివరాలు సేకరిస్తామన్నారు. సర్వే కోసం వస్తున్న తమ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లోని హరిహర క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వాహకులు యెరబాటి రాజేశ్వర్‌రావు నేతృత్వంలో శ్రీదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కె.భగవంత్‌రావు, అభిషేక్ దంపతులు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. వధూవరుల తరపున హైకోర్టు న్యాయవాది యెరబాటి సుపీత అశోక్‌రావు, ఇమ్మడి జ్యోతి శ్రీనివాస్ పాల్గొన్నారు. వేద పండితులు మల్లవజ్జుల ప్రవీణ్ శర్మ కల్యాణం జరిపించారు. భక్తులు స్వామివార్లకు ఒడి బియ్యం, సారె, కానుకలు సమర్పించారు. అర్చక పూజారులు వల్లూరి సతీశ్‌శర్మ, దత్తాత్రేయ శర్మ, సాయిప్రసన్న, కృష్ణ శర్మ, రఘుశర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. అనంతరం అన్నదానం చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ జిన్న రాంచంద్రారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రఘుపతిరావు, పులి కిషన్‌రెడ్డి, మెట్టు శ్రీశైలం, నార్ల రాజన్న, రాజేంద్ర ప్రసాద్, బూర్ల రవి పాల్గొన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

పాలకుర్తి: మండల పరిధిలోని రైతులకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని పాలకుర్తి, బసంత్‌నగర్, కుక్కలగూడుర్ తదితర గ్రామాలకు చెందిన వివిధ ఫర్టిలైజర్స్ షాపులను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా నిల్వలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. మండలంలో కన్నాల, మేడిపల్లి సహకార సంఘాల ద్వారా కుక్కలగూడుర్, ఈసాలతక్కళ్లపల్లి, పుట్నూర్ గ్రామాల్లో బ్రాంచ్ లైసెన్స్ కలిగిన కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులకు సరఫరా చేయాల్సిన ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు విక్రయిస్తే డీలర్ల లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.

పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై అభ్యంతరాలు ఉంటే తెలపాలి


బోర్డుపై డ్రాఫ్ట్ నోటిఫికేషన్ అంటిస్తున్న ఎంపీడీవో

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లోని ఎంపీడీవో కార్యాలయం వద్ద డ్రాఫ్ట్ నోటిఫకేషన్‌ను ఎంపీడీవో దివ్య దర్శన్‌రావు విడుదల చేశారు. స్థానిక అధికారులతో కలిసి మంగళవారం నోటీస్‌బోర్డుపై అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం మండల ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్లు ప్రచురించినట్లు పేర్కొన్నారు. సుల్తానాబాద్ మండల పరిధిలో 13 ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ స్థానాలకు గాను 74 పోలింగ్ స్టేషన్లు గుర్తించినట్లు తెలిపారు. మొత్తం ఓటర్లు 39,111 ఉండగా ఇందులో పురుషులు 19,167 మంది, మహిళలు 19943, ఇతరులు 01 ఉన్నారని వెల్లడించారు. పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 13వ తేదీలోగా రాత పూర్వకంగా మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. పోలింగ్ స్టేషన్లపై సలహాలు, సూచనలు అభ్యంతరాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో 13న ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఉంటుందనిర, అభ్యంతరాలు ఉంటే తెలపాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

• నాసిరకంగా ఉంటే బ్లాక్‌లిస్ట్‌లోకే..

కోల్‌సిటీ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకుంటే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడతామని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్(ఎఫ్‌ఏసీ) అరుణశ్రీ హెచ్చరించారు. ఇంజినీరింగ్ అధికారులు, టీయూఎఫ్‌ఐడీసీ, 14వ, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లతోపాటు సివిల్ కాంట్రాక్టర్లతో మంగళవారం తన కార్యాలయంలో సమీక్షించారు. ఒప్పందం ప్రకారం గడువులోగా పనులు పూర్తిచేయాలన్నారు. బిల్లులు రికార్డు చేయడంలో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసి కాంట్రాక్టర్లను ఇబ్బంది పెడితే కలెక్టర్ లేదా తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పూర్తయిన పని రికార్డులు త్వరగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత కొత్త పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ఎస్‌ఈ శివానంద్, ఈఈ రామన్ తదితరులు పాల్గొన్నారు.

• సీపీఐ సమావేశం విజయవంతం చేయాలి

సుల్తానాబాద్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో సీపీఐ పోటీ చేస్తుందని, దీనిపై 13న జిల్లా కేంద్రంలోని సీపీఐ సమావేశం నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ తెలిపారు. ఈ సమావేశానికి కేంద్ర కార్యవర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, జాతీయ సమితి సభ్యులు కామ్రేడ్ కలవేన శంకర్ హాజరవుతారని పేర్కొన్నారు. సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

• రేషన్ బియ్యం పట్టివేత

మంథని: మండలంలోని నాగారం శివారులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. అందిన సమాచారం మేరకు ప్రజా పంపిణీ బియ్యాన్ని రవాణా చేస్తున్నారని పౌరసరఫరాల శాఖ అధికారితో కలిసి నాగారం గ్రామ శివారు వద్ద మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఆటో ట్రాలీని సోదా చేయగా అందులో 10 సంచుల్లో ప్రజా పంపిణీ బియ్యం రవాణా చేస్తున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

• ఉపాధ్యాయులకు శిక్షణ

ఎలిగేడు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ మీటింగ్‌లో భాగంగా మంగళవారం జూలపల్లి, ధర్మారం, సుల్తానాబాద్, ఎలిగేడు మండలాలకు చెందిన తెలుగు భాష ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో నరేంద్రచారి, కాంప్లెక్స్ హెచ్‌ఎం గంద్ర దేవేందర్‌రావు, టీచర్లు పాల్గొన్నారు.

• చలో హైదరాబాద్ విజయవంతం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 20న చేపట్టిన చలో హైదరాబాద్ విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమాక్రసీ మంథని డివిజన్ కార్యదర్శి బి.అశోక్ పిలుపునిచ్చారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీలో పనిచేస్తున్న వివిధ సెక్షన్ల కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి మంళవారం చలో హైదరాబాద్‌కు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు.

• గొర్రెల కాపరి మృతి

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం శివారులో గొర్రెల మంద వద్ద నిద్రిస్తున్న కొయ్యడ రాజయ్య(53) మృతి చెందారు. ఎన్టీపీసీ పోలీసులు తెలిపిన కథనం ప్రకారం కమాన్‌పూర్ మండలం రొంపికుంట గ్రామానికి చెందిన కొయ్యడ రాజయ్య కొన్ని రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. గొర్రెల మంద వద్ద నిద్రిస్తుండగా అనారోగ్యంతో మృతి చెందాడని మృతుడి కుమారుడు కొయ్యడ సంజీవ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు.

• వృద్ధురాలు మృతి

మంథని: మంథనిలోని అంబేడ్కర్ చౌరస్తాలో కూరగాయలు అమ్మే ఓ వృద్ధురాలు ఒక్కసారిగా సొమ్మసిల్లి ప్రాణాలు వదిలింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన చీర్ల శంకరమ్మ(65) కొంతకాలంగా తన ఇంట్లో సాగుచేసిన కూరగాయలను అంబేడ్కర్ చౌరస్తాలో అమ్ముతోంది. రోజులాగే కూరగాయలు అమ్ముతున్న ఆమె ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయింది. స్థానికులు గమనించి సామాజిక వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు పేర్కొన్నారు.

• విమర్శలపై ఆత్మపరిశీలన చేసుకోవాలి

రామగిరి: టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి గతం తెలుసుకుని మాట్లాడాలని, తమ నాయకుడు జనక్ ప్రసాద్‌ను విమర్శించడంపై ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆర్జీ–3 ఏరియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సెంటినరీకాలనీలోని శ్రీపాదభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర కార్యదర్శి తిరుపతి, కుమార్‌స్వామి, బ్రాంచ్ కార్యదర్శి శ్రీనివాసరావు, కుమార్, పిట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పట్టణ అభివృద్ధికి సహకరిస్తాం


పుష్పగుచ్ఛం ఇస్తున్న మాజీ చైర్‌పర్సన్ లక్ష్మి

సుల్తానాబాద్: పట్టణ అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తామని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మహ్మద్ నియాజ్‌ను మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మున్సిపల్‌లో విలీనమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు గాజుల రాజమల్లు, హరీశ్ ఉన్నారు.

యూరియా నిల్వల తనిఖీ


రికార్డులను తనిఖీ చేస్తున్న ఏవో ప్రత్యూష

జూలపల్లి: మండలవ్యాప్తంగా రైతులకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష తెలిపారు. జూలపల్లిలోని ప్రైవేటు దుకాణాలతో పాటు పీఏసీఎస్ గోదాంలో యూరియా నిల్వలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతులకు అందుబాటులో ఉండి యూరియా సరఫరా చేయాలని ఆదేశించారు.

చెత్త తొలగింపు



సాక్షి స్పందన

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ నర్రాశాలపల్లె రోడ్డు పక్కనే చెత్తకుప్పలు ఉన్నాయి. దీనిపై 'రోడ్డు పక్కనే చెత్త కుప్పలు' అనే శీర్షికన సాక్షిలో మంగళవారం కథనం ప్రచురితమైంది. జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు), నగర పాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ ఆదేశాల మేరకు సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్ రాథోడ్ చెత్త కుప్పల ప్రాంతాన్ని పారిశుధ్య విభాగం సిబ్బందితో చెత్త తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ చెత్త తొలగింపు కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు రోడ్డుపై చెత్త వేయొద్దని కోరారు. ఇష్టానుసారంగా రోడ్డుపై చెత్త వేసే వారిని గుర్తించి జరిమానా విధిస్తామని తెలిపారు. చెత్తకుప్పల తొలగింపుపై స్థానికులు 'సాక్షి'కి, మున్సిపల్ శానిటేషన్ విభాగానికి కృతజ్ఞతలు తెలిపారు.

వాహనాల తనిఖీ

ఓదెల: మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంపులలో ఏఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. గుంపుల మీదుగా జమ్మికుంట, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ వైపులకు వెళ్లే పలు వాహనాలను తనిఖీ చేశారు. అనుమతి లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.

విద్యార్థులకు సన్మానం



సన్మానిస్తున్న అలయన్స్ క్లబ్ సభ్యులు

ధర్మారం: జాతీయస్థాయి మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులను మంగళవారం అలయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మధుప్రియ, శక్తిస్వరూప్, సహస్ర, జయసింహ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. విద్యార్థులను క్లబ్ సభ్యులు సన్మానించారు. సనాతన ధర్మ ప్రచారకర్త ఇప్పలపల్లి సురేందర్ ఎంపికైన విద్యార్థులకు భగవద్గీత బహూకరించారు. రీజినల్ చైర్మన్ సురేందర్‌గౌడ్, జోన్ చైర్మన్ ఎలగందుల అశోక్, క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎలిగేటి మహేందర్, కోశాధికారి తోడేటి మురళి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్: జిల్లా ఎన్‌పీడీఎస్‌ఎల్‌లో పనిచేస్తున్న మైనార్టీ ఉద్యోగులు ముద్రించిన క్యాలెండర్, డైరీలను మంగళవారం ఎస్‌ఈ మాధవరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టెక్నికల్ డీఈ రవీందర్, ఏవో లక్‌పతి, ఏడీ కమర్షియల్ సుగుణయ్యతో పాటు అఫ్రిన్, తిరుపతి, అఫ్జల్, రహీం, తహసీన్, అహ్మద్‌షరీఫ్, షబ్బీర్‌హుస్సేన్ ఉన్నారు.

విద్యార్థులకు అభినందన


అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖనిటౌన్: అంతర్జాతీయ స్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను మంగళవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అభినందించారు. ఇటీవల తమిళనాడులోని మధురైలో నిర్వహించిన జాతీయస్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో గోదావరిఖనికి చెందిన జి.సాయి రిషిక్ అండర్–10 కేటగిరీలో బంగారు, రజిత పథకాలు, అండర్–8 కేటగిరీలో జి.అభిరామ్ నందన్ బంగారు, రజిత పథకాలు సాధించారు. వీరిని స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అభినందించారు.

ఆకట్టుకున్న మదర్ ఆఫ్ నేచర్ చిత్రం


రజనీ గీసిన చిత్రం

మంథని: హైదరాబాద్‌లోని నెహ్రూ గ్యాలరీలో రెండురోజుల క్రితం అంజి ఆకొండి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రియేటివ్ హార్ట్ స్ట్రోక్ చిత్ర ప్రదర్శనలో మంథని ప్రాంతానికి చెందిన తుమ్మల రజినీ కుంచె నుంచి జాలువారిన చిత్రం ఆకట్టుకుంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 50మంది చిత్రకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో రజినీ మదర్ ఆఫ్ నేచర్ పేరుతో ప్రదర్శించిన చిత్రం ప్రత్యేకతను చాటింది. ప్రకృతి అందాలను ప్రతిబింబించేలా రూపొందించడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రకృతిని విభిన్న కోణంలో అందరికీ అర్థమయ్యే రీతిలో ఒకే చిత్రంలో ప్రదర్శించడం అభినందనీయమని జేఎన్‌ఏఎఫ్‌ఏయూ వైస్ చాన్స్‌లర్ గంగాధర్ కొనియాడారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థిని ఎంపిక



రితిష

ముత్తారం: మండలంలోని ధర్యపూర్ ఆదర్శ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని రౌతు రితిష నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ కేసరి సంతోష్‌కుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే పరీక్షల్లో ప్రతిభ కనబరిచింది. ఈ విద్యార్థినికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.12వేల స్కాలర్‌షిప్ వస్తుందని ఆయన పేర్కొన్నారు.

దీన్‌దయాల్ ఉపాధ్యాయ అడుగుజాడల్లో నడుద్దాం

రామగుండం: దీన్‌దయాల్ ఉపాధ్యాయ అడుగుజాడల్లో నడుద్దామని బీజేపీ అంతర్గాం మండల అధ్యక్షుడు బోడకుంట సుభాశ్ అన్నారు. ఎల్లంపల్లిలో బూత్ అధ్యక్షుడు శాఖపురం కుమార్ అధ్యక్షతన మంగళవారం దీన్‌దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు మాడ ప్రభాకర్‌రెడ్డి, శాఖపురం కుమార్, మల్లేశ్, సతీశ్, అనిల్‌రెడ్డి, సత్యంగౌడ్, రాజశేఖర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు


ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుంటున్న రైతులు

ముత్తారం: ముత్తారం మానేరు నుంచి తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను మంగళవారం రైతులు, స్థానికులు అడ్డుకున్నారు. మానేరు నుంచి రోజుకు వందలాది ఇసుక ట్రాక్టర్లు రావడంతో దుమ్ముతో పంటపొలాలు పాడవుతున్నాయని, గ్రామంలో దారి కనిపించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం రెండు గంటల పాటు ట్రాక్టర్లను నిలిపివేశారు. ఎస్సై గోపతి నరేశ్‌కు సమాచారం అందించగా హెడ్‌కానిస్టేబుల్ మధునయ్య సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. దుమ్ము లేవకుండా రోజూ నీరు చల్లుతామని ట్రాక్టర్ల యజమానులు తెలపడంతో రైతులు ఆందోళన విరమించారు.



గోదావరిఖని: ఆటోట్రాలీలో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన సంఘటనలు అనేకం జరుగుతూనే ఉన్నాయి. ప్రతీరోజు ఏదో ఒకచోట ప్రమాదాల వార్తలు చూస్తూనే ఉంటున్నాం. అయినా ప్రయాణించే ప్రజలు, తరలించే ఆటో యాజమానుల్లో మాత్రం మార్పు రావడం లేదు. పదుల సంఖ్యలో జనాన్ని ఆటో ట్రాలీల్లో తరలిస్తున్నారు. ఎలాంటి భద్రత లేని ఆటోట్రాలీ ప్రయాణంపై పోలీసులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు స్థానికంగా వినవస్తున్నాయి. ఇప్పటికైనా రక్షణ లేని ప్రయాణాలపై పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

జీఎంకు కృతజ్ఞతలు


జీఎంకు స్వీట్ తినిపిస్తున్న మైనార్టీ నాయకులు

గోదావరిఖని: ముస్లిం మైనార్టీ నాయకులు మంగళవారం ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్‌ను కలిశారు. రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు జీఎంను కలిసి స్వీట్లు అందజేశారు. ఖబరస్తాన్ గ్రేవ్‌యార్డ్‌లో వీధిదీపాలు, మంచినీటి సదుపాయం కల్పించాలని కోరగా సానుకూలంగా స్పందించి అభివృద్ధి చేశారన్నారు. దీనికి వారు జీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నజీముద్దీన్, ముబీన్ ఉన్నారు.

నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: వేసవికాలంలో కార్మిక కుటుంబాలకు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని టీబీజీకేఎస్ ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ కోరారు. ఆర్జీ–2 జీఎం వెంకటయ్యను జీఎం కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వేసవిలో నీటికొరత ఏర్పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. కొన్ని రోజులుగా యైటింక్లయిన్‌కాలనీలోని కార్మిక క్వార్టర్లకు నీటి సరఫరా సరిగా జరగడం లేదన్నారు. దీంతో కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయన్నారు. అలాగే యైటింక్లయిన్‌కాలనీ నుంచి గోదావరిఖనికి వెళ్లే కోల్‌కారిడార్ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. దీంతో డ్యూటీలకు వెళ్లివచ్చే వారు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోయారు. శ్మశాన వాటికలో నీటి సౌకర్యం, లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పోతనకాలనీ కమ్యూనిటీ హాల్లో ఆరు గెస్ట్ రూమ్‌లు నిర్మించాలని కోరారు. కాలనీ, పోతన కాలనీలో ఆర్వోప్లాంట్ సరైన నిర్వహణ లేక శుద్ధ జలం సరఫరాకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. నాయకులు చెరుకు ప్రభాకర్‌రెడ్డి, బేతి చంద్రయ్య, అబ్బు శ్రీనివాసరెడ్డి, కూర తిరుపతి, అనిల్‌రెడ్డి, బేతి రవితేజ, దాసరి శ్రీనివాస్, వెంకటేశ్, శ్రీకాంత్ కమలాకర్, రాకేశ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గోదావరిఖని: అఖిల భారత ఖదాన్ మజ్దూర్(బీఎంఎస్) 19వ త్రైవార్షిక మహాసభలు ఈనెల 12,13వ తేదీల్లో నాగ్‌పూర్‌లో రేషింబాగ్‌లోని నిర్వహిస్తున్నట్లు బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ మహాసభకు కేంద్ర బొగ్గుగనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, యూనియన్ జాతీయ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సురేంద్రపాండే పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. మహాసభలో కోలిండియా, సింగరేణి, నైవేలీ లిగ్నైట్ సంస్థల్లో పనిచేస్తున్న బీఎంఎస్, ఏబీకేఎంఎస్ నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. బొగ్గు గనుల్లో రక్షణ, తగ్గిపోతున్న పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల పరిస్థితి, కాలుష్యం పలు సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. యతిపతి సారంగపాణి, ఆకుల హరిణ్, మాదాసు రవీందర్, కర్రావుల మహేశ్, వడ్డేపల్లి కుమారస్వామి, సాయవేణి సతీశ్, తాట్ల లక్ష్మయ్య, పల్లె శ్రీనివాస్, చిన్న సతీశ్, చీకట్ల మల్లేశం పాల్గొన్నారు.

రోడ్డుపై డంపు చేసిన చెత్త తొలగింపు


పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం

సాక్షి స్పందన

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లో రోడ్డుపై కార్పొరేషన్ చెత్తను డంప్ చేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై 'సాక్షి'లో మంగళవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. రామగుండం శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం రోడ్డుపై డంపు చేసిన చెత్తను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఇక ముందు రోడ్డు పక్కన చెత్తను డంపు చేయకుండా చర్యలు చేపడతామని తెలిపారు.

తొలగించిన చెత్తను డంప్‌యార్డుకు తరలించాలి

సుల్తానాబాద్: తొలగించిన వ్యర్థ పదార్థాలు, చెత్తను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్‌యార్డుకు వెంటనే తరలించాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ ఆదేశించారు. పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం ఎప్పటికప్పుడు మెరుగుపడేలా కార్మికులు శ్రద్ధ తీసుకోవాలని, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు శానిటరీ సూపర్‌వైజర్ రాజ్‌కుమార్, జవాన్, ఆనంద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సుల్తానాబాద్‌రూరల్: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ వేణుగోపాలచారి సూచించారు. కాట్నపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన సమస్యల పరిష్కార సదస్సులో ఆయన మాట్లాడారు. లూజ్‌వైర్లు, విద్యుత్ మీటర్లు, ఎక్స్‌టెన్షన్ వైర్ల సమస్యలు పరిష్కారమయ్యేలా ఫోరం సభ్యులు చర్యలు తీసుకున్నారన్నారు. మంథనిలో అధిక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని ఎస్‌ఈ మాధవరావుకు సూచించారు. ఫోరం సభ్యులు రమేశ్, చరణ్‌దాస్, డీఈ తిరుపతి, ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు సైఫ్‌అలీ, కిశోర్, సంపత్‌కుమార్, దమోదర్‌రావు, సబ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.